# తీరని వాంఛలు

**శ్రీ ముద్దంశెట్టి హనుమంతరావు**

విమల చిన్న మెదడుకి ప్రపంచంలోని హెచ్చుతగ్గుల అంతర్యమేమిటో అర్థం కాలేదు. తను చదువుతున్న బడిలో రకరకాల అమ్మాయిల్ని చూస్తూంది. కాని వాళ్ళంతా రెండే తరగతులుగా ఆమెకి అగుపిస్తుంటారు. కొందరెంతో భాగ్యవంతులు..... కాస్తయినా కష్టపడితే కంది పోతారేమోనని పుస్తకాల్ని మోసేందుకు సహితం ప్రత్యేక నౌకర్లుంటారు. ఎప్పుడూ మంచి మంచి బట్టలు వేసుకుని, రకరకాల కొత్త జోళ్ళు తొడుక్కుని వస్తూంటారు. మరికొందరు తనలాగే మామూలు బట్టలూ, ఒకే ఒక్క పాత జోడుతో అగుపిస్తుంటారు. ఇలా రెండు రకాలుగా ఆమెకి ఒక పట్టాన అర్థం కాలేదు....తనూ మంచి సిల్కు బట్టలు తొడుక్కుని, కొత్త జోడు వేసుకుంటే యెంత బావుంటుందీ?....అనుకునేది విమల అప్పుడప్పుడు. ఎంత చిన్నతనమైనా మనోవాంఛ లెక్కడికి పోతాయ్?

"అమ్మా, అమ్మా! వాళ్ళంతా మంచి సిల్కు గౌన్లు వేసుకుంటున్నారే.... నాకూ ఒకటి కుట్టించి పెట్టవే" అంది ఓ రోజు మారాం చేస్తున్నట్టు.

"మనమూ కుట్టించుకుందాం లేవే" అంది జానకమ్మ బుజ్జగిస్తూ.

"ఎప్పుడమ్మా, మరి...యెప్పుడడిగినా, యిలాగే అంటుంటావు" యేడుపు మొహం పెట్టింది విమల.

"అలాగేనమ్మా! అన్నయ్యకి వుద్యోగ మవుతుంది గా....అప్పుడు మంచి గౌను కుట్టిస్తానులే."

"అన్నయ్యకే వుద్యోగ మవ్వాలేమిటి? నాన్న వుద్యోగం చేస్తున్నారుగా!" అంది విమల....ఆమెకేం తెలుసు తండ్రి తెస్తున్న జీతంతో సంసారం నడపకుండా వుందని?

"నీకు తెలీదే పిచ్చితల్లీ....నాన్న జీతంలోనే కదూ మనం బ్రతుకుతున్నాం....! అన్నయ్యకి కూడా వుద్యోగమవుతే మనకి కావల్సినవన్నీ కొనుక్కోవచ్చును" అంది జానకమ్మ. కూతురు అంత ముచ్చటగా కోరిన కోరికను తీర్చలేనందుకు లోలోన యెంతగానో కుమిలిపోయింది. ఆ బాధ అట్టేసేపు నిలువలేదు. తన బాధని కూతురు అర్థం చేసుకుని అనేకమైన ప్రశ్నలు వేస్తుందేమోనని భయంవల్ల లేనినవ్వు నవ్వుకుంది.

"అమ్మా, మరే....చలపతిరావుగారమ్మాయి యెంత మంచి జోడు కొనుక్కుందనుకున్నావ్? చూడ్డానికి మహా ముచ్చటేస్తుందే! యెప్పుడూ నాకీ పాత జోడే....!" అంది విమల బుంగమూతి పెట్టుకుంటూ. జానకమ్మ గుండె తరుక్కుపోయింది. నిజమే. ఆ జోడు కొని రెండు సంవత్సరాలు కావస్తోంది.

"వాళ్ళకేం విమలా! చలపతిరావుగారు ఆఫీసరు....ఆఫీసరుగారమ్మాయిలు అట్లానే వుంటారమ్మా!" అంది జానకమ్మ.

"ఏదో ఒకటి చెప్తావే! నాకూ అట్లాంటి జోడొకటి కొనవే మరి...." అంది విమల. ఆ చిన్నపిల్లకి యేం చెప్పాలో అర్థం కాలేదు జానకమ్మకి. పిల్లల అభిప్రాయాలూ, వాంఛలు అదో రకంగా వుంటాయి. వాళ్ళకి విచక్షణా జ్ఞానం వుండదు. ఏవో కొత్త వస్తువులు చూడ్డం, అవి కావాలని మారాం చేయటం వాళ్ళకి పరిపాటి. వున్న మహారాజు అవుతే కొండమీద కోతిని కూడా కోటి రూపాయలిచ్చి కొని తేగలరు. కాని జానకమ్మ యెలా తెస్తుంది?

"అలాగే అమ్మా...యిప్పుడవన్నీ యెందుకే? కాస్సేపు చదువుకోకూడదూ?" అంది జానకమ్మ, కూతుర్ని ఆ ప్రసక్తి నుండి మార్చించాలని. అప్పుడే సుందరం యింట్లోకి వస్తూ తల్లి మాటలు అస్పష్టంగా విన్నాడు.

"ఏమిటమ్మా....?" అంటూ మంచంపై కూలబడ్డాడు సుందరం.

"ఏమిటో లేరా, చిన్న బుద్ధి లెక్కడికి పోతాయ్....వాళ్ళ స్కూల్లో యెంతోమంది మంచి బట్టలు, జోళ్ళు, వేసుకుని వస్తారట.... దానికీ కావాలిట" అంది జానకమ్మ. సుందరం దీర్ఘ శ్వాస విడిచాడు.

"అనేకటోనమ్మా, మన బ్రతుకు లిలాగే వుండిపోతాయిగా మోసు....చిన్న పిల్ల ముద్దూ, ముచ్చటా తీర్చలేక పోతున్నాం" అన్నాడు సుందరం.

"మరేం చేస్తాంరా....మన చేతుల్లో వుందా, బ్రతుకంతే....మనలాంటి బ్రతికి చెడిన కుటుంబాలకే యీ బాధలన్నీ....ఇటు పై స్థాయిలో బ్రతికే తాహతు లేదు–అటు లేని బ్రతుకు బ్రతకలేం; ఇలాగే నాపు బ్రతుకుల మధ్య నలిగిపోతుంటాం. కానీ నీకైనా వుద్యోగమంటూ యేదో లభిస్తే, మళ్ళీ కాస్త మన కోరికలు చిగురిస్తాయి. అంటే ఆ ప్రాప్తి కూడా లేకపోతుంది" అంది నిరుత్సాహంగా.

సుందరం మనసు చివుక్కుమంది. కష్టపడి ఆర్జించే వయసువచ్చి కూడా యింకా పనికి రాకపోయాడు తను....తను మాత్రం యేం చేస్తాడు? ప్రయత్నిస్తూనే వున్నాడు. వుద్యోగం దొరకితే గా!

"ఔనమ్మా! అదే నేనూ బాధపడుతున్నాను....ఏమిటో ప్రస్తుత రోజు లింత గడుగ్గా తయారైనయ్....ఆలోచిస్తున్నానమ్మా, యే బట్టల కొట్లోనైనా గుమస్తా పనికి కుదిరిపోవాలని."

"అదేమిట్రా! యింతవరకూ చదివింది వుద్యోగం కోసమేనా?"

"మరేం చెయ్యనమ్మా! ఎన్నాళ్ళిలా సోమరిగా కూర్చుండను? యిన్నాళ్ళింతా అభిమానం చంపుకోలేక యీ ప్రయత్నం చెయ్యలేదు. ఇక ఆ అభిమానం చంపుకోవాలి! ఆ వచ్చే డబ్బు దేనికైనా వుపయోగిస్తుంది" అన్నాడు సుందరం కాస్త వుద్రేకంగా. నిజానికి అతనికి విరక్తి పుట్టిపోయింది. వుద్యోగం దొరక్కపోవటంతో. జానకమ్మ మాట్లాడలేదు....ఆమెకి కొడుకు అభిప్రాయం ఓ విధంగా నచ్చింది.

వాళ్ళేం మాట్లాడుకున్నారో అర్థంకాక ఆశ్చర్యపోయింది విమల. తను బట్టలు, జోడు, విషయం యెత్తటంవల్లనే యీ సంభాషణంతా జరిగిందేమోననుకుని మాట్లాడకుండా తన చదువులో మునిగి పోయింది.

అనుకున్నట్టుగానే సుందరం ఓ బట్టల కొట్టులో గుమస్తాగా చేరాడు. ఎంత సహనంతో సిగ్గువిడిచి, వ్యక్తిత్వం లేనివాడిలా అందులో జొరబడినా యేం లాభం? ఆ కొట్టు యజమాని, ముప్ఫయి రూపాయలకంటె ఒక్క దమ్మిడీ యెక్కువ యివ్వనన్నాడు.

ఏవిటో వాళ్ళకి వచ్చే పండుగలకొద్దీ లాభంలో కష్టజీవులకి ఓ కానీ ఎక్కువివ్వటానికి ప్రాణాలు పోయినట్లే భావిస్తారు వీళ్ళంతా....

గత్యంతరం లేక సుందరం సరే నన్నాడు. కొడుకు బట్టలకొట్లో పని చేయటం యిష్టం లేకపోయినా అప్పటి యింటి పరిస్థితులకి లొంగిపోయింది జానకమ్మ.

పండుగొస్తోంది పది ముఖాలతో....ఎవరి కోసం....? కేవలం భాగ్యవంతులకోసమే! సామాన్యులకోసం కాదు....నూతన వస్త్రాభరణాలతో పంచభక్ష్య పరమాన్నాలతో పండుగ గడుపుతారు ధనవంతులు....కాని సామాన్యులు వీళ్ళకి వ్యతిరేకం....అందుకే పండు గొస్తుందంటే సంబరపడే బదులు భయపడతారు సామాన్యులు....

విమలకి పండగ వూహలు మహా జోరుగా పరిగెత్తాయి. అన్నయ్యకి వుద్యోగ మయ్యింది.. ఆమె కేం తెలుసు యేం వుద్యోగమో!. అమ్మ చెప్పకుండా తనకి సిల్కు గౌను, జోడు కొంటుంది....తనూ అందరిలానే ముస్తాబై బడికి వెళ్ళొచ్చు....అనుకుంది విమల....జానకమ్మ అంతరంలో కూడా అదే అభిప్రాయం వుంది. కనీసం సిల్కు గౌనయినా కూతురికి కట్టించాలనుకుంది. సుందరం సంపాదిస్తున్నది పండగ ఖర్చులకి వస్తోందనుకుని తృప్తిపడింది.

## 2

విమల తోటి పిల్లలతో బడికిపోతూ వుంటే త్రోవలో జగన్నాధం కూతురు లలిత కల్సింది. లలితకీ, విమలకీ కాస్త స్నేహం వుంది.

"ఏవేఁ లలితా! నాలుగు రోజులైంది గామోసు — స్కూలుకి రాలేదేం?" అంది విమల.

"జ్వరంతో వున్నానే యీ నాలుగు రోజులూ....నిన్ననే సాయంకాలం విడిచి పెట్టింది... యీవాళ కూడా మా నాన్న బడికి పోవద్దన్నారు తెలుసా....? కాని ప్రాణాలు పోతాయని కానే వచ్చేస్తున్నా" అంది లలిత.

"పోనీ మరిరెండు రోజు లుండి పోలేక పోయావూ?"

"ఎందుకే వూరికినే వుండిపోవటం.... డాక్టర్నడిగారు మా నాన్న. స్కూలుకి పోవచ్చునన్నారు. విమలా డాక్టరెంత మంచివా డనుకున్నావ్? బత్తాయిపళ్ళు, ద్రాక్ష పళ్ళు, బిస్కట్లు, రొట్టె, తప్ప మరేం తినొద్దన్నాడు...." అంది లలిత అదోలా ముఖంలో భావాల్ని వ్యక్తపరుస్తున్నట్టుగా. విమలకి నోరూరిందనే చెప్పాలి.

"అవుతే, మీ నాన్న తెచ్చారా?" అంది విమల లలిత మొహంలోకి చూస్తూ.

"ఏవిటి....?"

"పళ్ళూ, బిస్కట్లూ, రొట్టేనూ" అమాయకంగా అంది విమల.

"ఓ.! ఎన్నో తెచ్చారు....నాకు మరేం తిండి లేదనుకదూ! రోజూ మూడు పూటలూ యివే తిని ఓవల్టిన్ త్రాగే దాన్ని .... మా నాన్న రొట్టెతో వెన్న తెస్తామన్నారు కూడా.... నేనే వద్దనేశాను" అంది లలిత. విమలనుకుంది జ్వరంవస్తే యివన్నీ తింటారు గామోసని.

"అవుతే లలితా, జ్వరమొస్తే యివన్నీ తింటారా!"

"డాక్టరలా చెప్పేడే మరి...."

"నాకు జ్వరమొస్తేనో....?" అంది విమల అమాయకత్వంగా.

"నీకూ తిన మంటాడు డాక్టరివన్నీను" అంది లలిత కాస్త కళ్ళు పెద్దవిగా చేస్తూ. విమలకి మళ్ళీ నోరూరింది. తనకెప్పుడూ జ్వరం రాదేం? వస్తే తనూ తింటుంది గా! అప్పుడు అమ్మ మాత్రం తనకోసం యివన్నీ తెప్పించదూ! తప్పక తెప్పిస్తుంది—అనుకొంది విమల ఆమె కింకా పరిస్థితులు పూర్తిగా అర్థం కాలేదు మరి....అప్పటికే స్కూలు దగ్గర పడింది....ఎవరి క్లాసుకి వాళ్ళు పోయారు.

విమల హృదయం యిప్పుడు కొన్ని వాంఛలకి తావయింది. ఓ సిల్కుగౌను, కొత్త జోడు కావాలి.... జ్వరం వస్తే పళ్ళూ, బిస్కట్లు తినాలి....అసలు ఆ నెప్పుడూ ద్రాక్షపళ్ళెలా వుంటాయో చూళ్ళేదుకూడా... యీ ఆలోచనలు ఆమె మెదడులో స్థిరంగా నాటుకపోయాయ్.

బడినుండి వచ్చి రావటంతోనే అమ్మ దగ్గరికి పోయింది పుస్తకాల్ని ఓ మూల గిరాటువేసి.

"అమ్మా, అమ్మా!" అంటూ తల్లి ఒడిలో వాలింది. జానకమ్మ బియ్యంలో రాళ్ళు యేరుతూ,

"ఏవమ్మా...." అంది.

"మరి....నాకు జ్వర మొస్తే బత్తాయిపళ్ళు, ద్రాక్షపళ్ళు, బిస్కట్లు, యిస్తావుకదే!" అంది విమల. జానకమ్మకి గతుక్కుమంది ఆమెకీ అభిప్రాయా లెప్పు డెందుకు కలిగాయా అని.

"ఇప్పు డెందుకే యీ మాటలన్నీ? నీకు జ్వరం వచ్చినప్పుడు కదమ్మా .... అలాగే" అంది జానకమ్మ, అందేగాని తను ద్రాక్షపళ్ళు కొనేపాటి వ్యక్తా....అనుకుంది మనసులో.

"చెప్పమ్మా కొనిస్తావుకదే! లలితకి వాళ్ళ నాన్న అలానే కొనిచ్చారుటే" అని మరింత వత్తిడి చేసూ విమల తండ్రి పురుషోత్తం అప్పుడే ఆఫీసునుండి వస్తూ కూతురు మారాం చేస్తున్న మాటలు విన్నాడు

# ప్రస్తుత లాభం

ఇన్సూరెన్సు ఏజంటు: మీరు ఇన్సూరు చేస్తే, మీ తదనంతరం మీ భార్యాబిడ్డలు సుఖపడేందుకు డబ్బు వస్తుం దండీ!

ఒక గృహస్థు: నా తదనంతరం సంగతి దేనికి గానీ, నీ తదనంతరం నాకు వచ్చేదేమన్నా వుంటే చెప్పు, చేస్తాను.

శ్రీ బొడ్డుపల్లి కృష్ణావధాని
(కొవ్వూరు)

"ఏవంటుందమ్మాయ్ జానకీ!" అన్నాడు పురుషోత్తం దగ్గరిగా వచ్చి.

"దీనికి రోజుకో వింతాలోచన పుడుతుంది లెండి....జ్వరంవస్తే తనకి పళ్ళూ, బిస్కట్లు యిస్తారా? అని అడుగుతుంది" అంది జానకమ్మ. లోపల బాధవున్నా, నవ్వు నాపుకోలేక నవ్వేసింది. పురుషోత్తం ఓ నిట్టూర్పు విడుస్తూ,

"నీకెందుకే అమ్మాయ్, యీ ఆలోచనలన్నీను....ఎప్పుడో నీకు జ్వరం వస్తేకదూ! అలాగే యిస్తాంలే" అంటూ బట్టలు మార్చుకుందుకు పోయాడు. విమల కిప్పుడు కాస్త తృప్తి కలిగింది.

పండగ దగ్గర పడుతూంది. ఈ మధ్య విమల సిల్కుగౌను, జోడుకోసం మరీ వత్తిడి చేస్తుంటేది తల్లిని. జానకమ్మ అనుకొంది సుందరం జీతం దొరకంగానే విమల వాంఛల్ని తప్పక తీర్చాలని....కాని ఎప్పుడూ వున్నదే మన ఆలోచనలకి ఎదురొస్తుంది విధి—

పండగ అయిదుదినా లుందనగా విమల ముఖం రంగు మారింది. ఆమె కళ్ళు కాస్త ఎర్రబడ్డాయ్? క్రమంగా జ్వరం వచ్చి క్రమంగా తీవ్రత వహించింది. జానకమ్మ గుండెలు నీరైపోయాయ్ .... పండగనుంచే తన పిల్లకీజ్వరం రావాలా....అని తలపోసింది.

ఆరోజు సాయంకాలం సుందరం కొట్టు నుండి తిరిగివచ్చి జ్వరంతో పడున్న చెల్లాయిని చూసి నిర్ఘాంతపోయాడు. డాక్టర్ని తీసుకొస్తానన్నాడు. జానకమ్మకి తెలుసు డాక్టరుగారొస్తే కనీసం [illegible]



“నాకు జ్వరమొస్తే బత్తాయిపళ్ళు, ద్రాక్షపళ్ళు, బిస్కట్లు యిస్తావు కదే” అంది విమల

నందుకు ఫీజు యిచ్చుకోవాలి....అందుకే మూడురోజులవరకు చూసి తరువాత డాక్టర్ని తేవచ్చింది. సుందరం తల్లిమాట కాదనలేక పోయాడు.

మూడోరోజు విమల జ్వరం మరింత యెక్కువయ్యింది. అప్పుడప్పుడు పరాకు మాటలాడుతుండేది. చెల్లెలి అవస్థచూచి సుందరం బట్టల కొట్టుకి వెళ్ళలేదా రోజంతా; ఒక్క రోజు రాకపోయినందుకు బట్టలకొట్టు యజమాని ఆగ్రహించి సుందరాన్ని వుద్యోగంనుండి వూడదీస్తూ అతనికి రావల్సిన 27 రూపాయలు యింటికి పంపించేశాడు. సుందరం నివ్వెర పోయాడు....తన వుద్యోగం వూడిపోవటమే మంచిదయిందని?....ఆ 27 రూ. తల్లి చేతికిచ్చాడు. కొడుకు వుద్యోగం పోవటం జానకమ్మ కంతగా బాధనిపించలేదుగాని, ఆ రూపాయలు చేతిలో పడ్డం యెంతో ఆశ కల్పించింది. నిజమే! మరి....కూతురికి జ్వరం తీవ్రత హెచ్చయింది. డాక్టర్ని తీసుకురావాలి. మందులు కావాలి....అన్నింటికి డబ్బుండాలి గుర్తుకొంది ‘తనకి జ్వరం వస్తే పళ్లు తినిపిస్తాను కదమ్మా’ అని. ఆ మాట జ్ఞాపకం వచ్చింది జానకమ్మకి. ఆ పసితనంలో కూతురలా అన్నదేగాని, తను ద్రాక్షపళ్లు కొనివ్వగలదా!

పురుషోత్తం ఓ దగ్గర కూర్చుని తనింట్లో తటస్థపడుతున్న కష్టపరంపరల్ని తలుచుకుంటూ యేదో ఆలోచిస్తున్నాడు. భార్య తన దగ్గరికి వస్తుండటం గమనించి ముఖం పైకెత్తి ఆమెవేపు చూశాడు పేలవంగా. జానకమ్మ అతని చేతికి ఓ రూపాయినోటు అందిస్తూ.

“ఈ రూపాయి తీసికెళ్ళి బత్తాయిపళ్ళు, ఓ బేడ బిస్కట్లు తీసుకురండి ...అవి తినాలనే దాని కోరిక .... ముందుగానే అంది పిచ్చిపిల్ల” అంది.

“ద్రాక్షపళ్ళు తెస్తే బావుణ్ణే....అప్పుడంగి కదూ!” అన్నాడు పురుషోత్తం రూపాయి నందుకుని.

“మనం కొనగలమటండీ! పోనీ ఓ రెండణాల కొన్నిస్తే అన్నీ తీసుకరండి—ఏదో సంతృప్తి ...డబ్బున్నవాళ్లలాగా తెచ్చుకు తినగలమా” అంది జానకమ్మ. ఔనన్నట్టుగా పురుషోత్తం మౌనంగా నడిచాడు.

## 3

పండగరోజు వచ్చింది. విమల జ్వరం తిరుగుముఖం పట్టినా, యింకా పూర్తిగా తగ్గలేదు. అప్పటికే దగ్గర దగ్గర యిరవై రూపాయలు ఖర్చయింది. డాక్టరుకి ఫీజుకి, వాటికని; పండగనాటి సందడి, వుత్సాహమే లేదు ఆ యింట్లో. పోనీ ఓ పిండివంటయినా వండుకోవాలనుకున్నారు. కాని విమల తింటానని మారాం చేస్తుందేమో నని అదీ మానేసింది జానకమ్మ. ఆ రోజు వాళ్ళకి పర్వదినం కాదు ...మామూలు రోజే! జానకమ్మ కన్నీ చెమ్మగిల్లాయి....తనకుగాని, కూతురికి పండక్కయినా ఓ సిల్కు గౌను, వోడు కొనాలని—సుందరం వుద్యోగం దృష్టిలో వుంచుకొని; కాని అదీ వూడిపోయింది....పండగనాటికి విమల మంచమెక్కింది. అన్నీ అవాంతరాలే! రెండేళ్ళ క్రిందటి పండగ ఆమె స్మృతిపథంలో మెదిలింది—

ఆ రోజు పచ్చ పచ్చగా వున్న యిల్లంతా కలకల లాడుతుండేది కాని పరిస్థితులు అనుకోకుండా మారాయి. మరిది చదువు, అతని వివాహానికి పుస్తె కోసం భూములు అమ్ముకుంటిపోయాయి....పెద్ద కూతురు పెళ్ళికి మరి కొంత అప్పు ఇలాగే ఒకదాని వెంట ఒకటి అలుముకున్నాయి పోనీ, మరిదైనా తమ నంటుకునివుంటే, యింత యిబ్బంది వుండకపోను. పెళ్ళవ్వటమే తడవుగా ఆయన వేరే కాపురం పెట్టారు. ఆ రోజులు తల్చి

రావనుకుంది జానకమ్మ. రోజుకి రోజూ కష్టాలు పెరిగిపోతున్నాయే గాని తగ్గటం లేదు.

పండగ ప్రశాంతంగానే జరిగిపోయింది పూర్వం. పురుషోత్తంగారింట్లో పండగ సూచనలే అగుపించలేదు....పండగ పోయిన మూడో రోజుకి విమల బాగానే తేరుకుంది. స్నానం చేయించేశారు....

"అమ్మా! మరి ద్రాక్షపళ్ళు తినిపిస్తామన్నావుకదే, తినిపించలేదేమే? జ్వరంవచ్చిన వాళ్ళకి తినిపిస్తారుట గా" అంది విమల అమాయకంగా. జానకమ్మకి కన్నీళ్ళు తిరిగాయి. "ఒకసారి తిన్నావు కదమ్మా.... అంతే....మరి తినరు" అనేసింది.

"అదేవిటమ్మా, లలిత రోజూ తింటుందట" అంది విమల.

"వాళ్ళ కేం అమ్మా — డబ్బుంది.... రోజూ తింటారు. మనం కొనుక్కోలేం కదూ! చాల విలువైనవి"

"పోనీలేవమ్మా! యెప్పుడూ నువ్వంతే.... మరి, పండక్కి నాకు కుట్టిస్తానన్నావుకదే సిల్కు గౌను, కొత్త జోడూను—యేవమ్మా యివాళ వేసుకుంటానే" అంది విమల ఎంతో ఆప్యాయంగా. ఆమె అభిప్రాయం తల్లి తనకోసం ఆ రెండు వస్తువులు కొని వుంచిందని. జానకమ్మకి యేడుపొచ్చింది. అంతవరకూ కళ్ళ కొసల్లో విహారం చేసున్న కన్నీటి బిందువులు విమల చేయిమీద పడ్డయ్. విమల ఆశ్చర్యంగా తల్లి మొహంలోకి చూసింది.

"ఏవమ్మా. యేడుస్తున్నావ్....?" అంది విమల మెల్లగా. జానకమ్మ కూతుర్ని యెత్తుకొని ఒక్కసారిగా హృదయానికి హత్తుకుంది. ఏం జవాబిస్తుందని? తను సిల్కు గౌను కుట్టించలేదు....జోడూ కొనలేదు....కొనలేకపోయింది....డబ్బులేదు....అనుకున్న వూహలన్నీ తారుమారయ్యాయ్. కూతురికి జ్వరం రాకపోతే తను తప్పకుండా కొనివుండేదే! ఇక కొనలేదు కూడాను. మళ్ళీ సంవత్సరంకి వుద్యోగం దొరికినదాకా....అంతవరకు విమల వూరుకుంటుందా? పేదరికంతో పోరాడుతున్నామని ఆ చిన్న హృదయానికి తెలీదు. ఏదో చెప్పాలి మరి....

"ఏవమ్మా అలా వున్నావ్?" మళ్ళీ అంది విమల నిరుత్సాహంగా. జానకమ్మ ధైర్యం చిక్కబెట్టుకుంది.

"ఏమీ లేదమ్మా—" అంటూ చీర చెరగుతో కళ్ళు తుడుచుకుంది.

"మరి—గౌను, జోడు ఏవమ్మా....? ఇవాళ తొడుక్కుంటానే:" అంది విమల. జానకమ్మ హృదయం మళ్ళీ భారమయ్యింది. "ఎందుకీ భారమైన బ్రతుకు" అనుకుంది.

"కుట్టించలేదమ్మా-అన్నయ్యకి వుద్యోగం పోయింది కదూ: మరి నీ జ్వరానికి కొద్దిగ ఖర్చయ్యిందా? డబ్బెలా వస్తుందే! చిన్న పిల్లవు నీకు తెలీదు గాని, డబ్బున్న వాళ్ళతో పోటీ తేస్తే యెలాగమ్మా! వాళ్ళేమైనా కట్టించుకుంటారు.... ఎన్నెంటి జోళ్ళయినా తొడుక్కుంటారు....మనం అలా వుండలేం కదూ! మనం పేదవాళ్ళమమ్మా...." అంది జానకమ్మ మళ్ళీ కన్నీళ్ళు తుడుచుకుని కూతుర్ని హత్తుకుంటూ. చివరికి నిజం చెప్పక తప్పింది కాదామెకి.

విమలకూడా యేడ్చేసింది. ఆమె యేడుపు, తల్లి యేడుస్తుంది కదా, అని....తను గౌను, జోడు, కొనమనటంవల్లనే తల్లి యేడుస్తుందనుకుంది. ఇక తానెప్పుడూ ఆ విషయం యెత్తకూడదనుకుంది విమల.... ఆమెలో అమాంతంగా మార్పు వచ్చేసింది....ఎవరెలా వున్నా తను మాత్రం మారకూడదనుకుంది.

"మరి యేమీ వద్దమ్మా నాకు....ఎప్పుడు డబ్బుంటే అప్పుడు కొనుక్కుందాం....జోడూ వద్దూ! గౌనూ వద్దూ!!" అంది విమల జ్ఞానోదయమైనట్లుగా.

జానకమ్మ కూతుర్ని ముద్దుపెట్టుకుంది.... పిల్లల మనసు ఇలా మారిపోతేనేగాని, లేదా యేవో మమతలు మనసులో వుంచుకొని అలా దిగజారిపోతుంటారని ఆమె భయం. విమల మార్పుతో ఆమెకా భయం తీరింది.

"నా చిట్టితల్లి కదూ! నీ కన్నీ కొంటాలే అమ్మా, అన్నయ్య వుద్యోగం అయ్యాక...." అంటూ ఆమె బుగ్గల్ని నొక్కుతూ ముద్దుపెట్టుకొని చంకనుండి దింపేసి వంటగదికి పోయింది. విమల చదువు ప్రారంభించింది.

మరుసటి రోజు స్కూలుకి పోయింది. లలిత అడిగింది.

"ఏం విమలా స్కూలుకి రాలేదు?" అని.

"జ్వరం లలితా!" అంది విమల.

"అయితే బాగా పళ్ళూ, బిస్కట్లూ తిన్నావన్నమాటే...." అంది లలిత నవ్వుతూ.. చిన్న పిల్లలికేం కావాలి, తినుబండారాలేగా....తనకి జరిగినట్టే విమలకూడా భోగాలు జరిగాయనుకుంది లలిత. ఆ చిన్న హృదయానికి తెలీదు, తనకీ విమలకీ తారతమ్యం వుందని.

"లేదే....ఒక్క బత్తాయిపళ్ళు తెచ్చారు.. ఓ నాలుగు బిస్కట్లూ—అంతే" అంది విమల కాస్త చిన్న బుచ్చుకొంటూ.

"జ్వరం యింతేనా? మా నాన్నవుతే బిస్కట్లు పేకట్లు తెచ్చారు....ద్రాక్షపళ్ళు తినలేదూ?" అంది లలిత ఆదోలా మొహం వుంచి.

"లేదే లలితా! మేం పేదవాళ్ళమట— అందుకే అవన్నీ కొనుక్కోలేమని అమ్మ చెప్పిందే...మీ కింటె డబ్బుందంట, యేమైనా, కొనుక్కుంటారట" అంది విమల అమాయకంగా, అమ్మ అన్న మాటల్ని అప్పచెప్పేస్తూ.. ఔను గామోసనుకుంది లలిత. అంతలో క్లాసులోకి మాస్టరు రావటంతో ఆగిపోయింది బాతాఖానీ.

విమల కిప్పుడు మునుపుండే వాంఛలు క్రమంగా సన్నగిల్లాయి. అల్లాంటి వాంఛలెప్పుడేనా జ్ఞాపకంవస్తే తన పేదరికం అడ్డుపడుతుంది. తల్లిముందు యే వస్తువుకోసం కూడా మారాం చెయ్యటం మానుకుంది.... ఒక్క మాటలో చెప్పాలంటే విమలలో అనుకోని మార్పు వచ్చేసింది....తన కోరికలు తీరాలంటే అన్నయ్యకి వుద్యోగం అవ్వాలన్న నమ్మిక ఆమెలో నాటుకపోయింది. అందుకే అన్నయ్యకి వుద్యోగం యెప్పుడవుతుందా అని ఆమె కూడా యెదురు చూస్తుంది.

## వైద్యం

కంఠంవరకు దుప్పటి ముసుగు వేసివున్న ఒక రోగిని పరీక్షించడానికి యిద్దరు డాక్టర్లు చెరి యొకప్రక్క నిలబడినారు. నాడి పరీక్ష కోసం యిద్దరి చేతులు దుప్పటిలోకి పోనిచ్చారు. ఒకరి నాడి మరియొకరు చూసుకుంటున్నారు; రోగి నాడి అనుకుని ఒక డాక్టరు పెదవి విరిచాడు. రోగి తల్లి— అంటే లాభం లేనట్టేనా అండి. (అని ఏడ్చింది)

ఒక డాక్టరు: అబ్బే! రోగం వంలేదే? బాగానే వుంది నాడి.

ఇంకో డాక్టరు: అబ్బే! వం లేదండి! కొంచెం నీరసంగా వుంది నాడి అంతే. పొద్దుట నుంచి ఆహారకం ఏంలేదు కాబోలు. కాస్త కాఫీ యిచ్చి రెస్టుగా పడుకోబెట్టండి.

—శ్రీ కె. భైరవమూర్తి